క్లుప్తంగా

కాల్వకు నీరు నిలిపివేత

కలసపాడు: బ్రహ్మం సాగర్ పరిధిలోని తెలుగుగంగ ప్రధాన ఎడమ కాలువకు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పది రోజుల పాటు నీటి సరఫరాను నిలిపివేస్తామని తెలుగుగంగ ఈఈ కృష్ణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరో మూడు రోజులు రైతులు తమ పంటల అవసరాలను తీర్చుకోవాలన్నారు. తర్వాత రైతుల అవసరాలను బట్టి నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

ఆర్థిక నేరాలపై అవగాహన

మైదుకూరు: ఆర్థిక నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకుని అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని వనిపెంట జ్యోతిబా పూలె బీసీ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం ఆర్థిక నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో ఆర్థిక నేరాలు ఎక్కువవుతున్నాయన్నారు. ప్రిన్సిపల్ వి.నిర్మల, కృష్ణయ్య యాదవ్ పాల్గొన్నారు.

డీకేటీ భూముల పరిశీలన

కలసపాడు : మండలంలోని చెన్నుపల్లెలో డీకేటీ భూములను ఆర్డీఓ చంద్రమోహన్ మంగళవారం పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గ్రామ దళితులు జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ మంగళవారం ఆ భూములను పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మధురవాణి, డిప్యూటీ తహసీల్దారు మోహన్‌రాజ్, ఆర్ఐ సింధుజ పాల్గొన్నారు.

చేనేత విభాగం అధ్యక్షుడి ఎంపిక



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న చౌడం రవిచంద్ర

ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా చౌడం రవిచంద్రను నియమించారు. ఈయన గతంలో తొగటవీరక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఐటీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మూడో వార్డుకు చెందిన చౌడూరు మహబూబ్‌బాషాను నియమించారు. ఈ సందర్భంగా వీరు మంగళవారం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే 28వ వార్డుకు చెందిన చింతల దానమ్మను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా నియమించారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాయలసీమ ఇన్‌చార్జి ఎండీ అయుబ్‌ఖాన్ కోరారు. ఈ మేరకు మంగళవారం డీఎస్పీ భావనను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్ పడిన సమయంలో వాహనదారులు వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు డీఎస్పీకి తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి వేళ యువకులు కేరింతలు కొడుతూ బైక్ రైడింగ్ చేస్తున్నారని తెలిపారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, జాకీర్ ఉస్మి, హుస్సేన్ బాషా, నజీర్ అహ్మద్, ముక్తియార్, అల్లాబకాష్, కమాల్‌బాషా పఠాన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

ప్రొద్దుటూరు: ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గద్దం రాజు తెలిపారు. కడప ఆర్జేడీ కార్యాలయంలో ఏడీని మంగళవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్‌సీ పరీక్షలకు సంబంధించి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ స్పాట్ వ్యాల్యుయేషన్ చేయడానికి ప్రైవేట్ టీచర్స్‌కు అవకాశం కల్పించాలని తెలిపారు. ఇన్విజిలేషన్‌లో ప్రైవేట్ టీచర్లకు అవకాశం ఇవ్వాలని కోరారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రొద్దుటూరు కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు మున్సిపల్ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ 2023 నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ, ఏడాదిన్నరయినా కార్యాచరణకు నోచుకోలేదన్నారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. కొత్తప్రభుత్వం వచ్చి 7 నెలలు పూర్తయినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్నారు

దువ్వూరు(చాపాడు) : ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి ముఖ్యమంత్రి అయ్యాక డబ్బులు లేవని చంద్రబాబు చేతులెత్తేయడం ప్రజలను మోసగించడమేనని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి 2019 నుంచి 2024 వరకూ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పేరుతో కూటమి నాయకులు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక పతకాలు అమలు చేయడం లేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు.

క్షతగాత్రులకు..ఆ తొలిగంటే కీలకం



- ఆస్పత్రికి తరలిస్తే.. గాయపడిన వారి ప్రాణం నిలవవచ్చు
- కేసులపై అపోహలు వీడాలంటున్న పోలీస్ అధికారులు
- క్షతగాత్రులకు సాయం చేస్తే కేంద్రం నగదు పురస్కారాలు

రోడ్డు ప్రమాదాలు ఇటీవల కాలంలో వేగంగా పెరుగుతున్నాయి. వేగం ప్రమాదాలకు కారణమవుతోంది. ప్రమాదాలు జరిగితే పరుగెత్తుకొచ్చిన జనం ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధించడానికి పోటీ పడుతున్నారేగానీ, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించేందుకు.. సాయం చేయడానికి ముందుకు రావడం లేదు. ఇది గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గుడ్ సమర్టిన్ చట్టాన్ని ప్రవేశ పెట్టింది. ఇది అమలులోకి వచ్చి మూడేళ్లవుతున్నా ప్రజలు అవగాహన లేదు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

బద్వేల్: నూతన సంవత్సరం జనవరి నెల ఇంకా పూర్తి కాలేదు. బద్వేల్ నియోజకవర్గంలో దాదాపు పది మంది యువకుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మృత్యువాతపడ్డారు. వ్యక్తిని వైద్యులు పరిశీలించి ఐదు నిమిషాల ముందు తీసుకు వచ్చి ఉంటే బాధితుడు బతికుండేవాడని చెబుతున్న మాటలు ఇటీవల సామాజిక మాధ్యమాల్లోనూ ఎక్కువగా వింటున్నాం. బద్వేల్ డివిజన్ పరిధిలో ప్రమాదాల్లో గదాయపడి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. సకాలంలో వారిని ఆస్పత్రిలో చేర్చి ప్రాణాలు కాపాడలేకపోతున్నారు. ఇందుకు జనాల్లో ఉన్న అపోహను తొలగించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. తమపై కేసులు నమోదు చేస్తారేమోనని చాలామంది వెనకడుగు వేస్తున్నారు.

ప్రమాదాలు జరిగే రహదారులు ఇవీ

బద్వేల్ డివిజన్ కేంద్రం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారులు ఈ విధంగా ఉన్నాయి. బద్వేల్ నుంచి అనంతపురం, నెల్లూరు జాతీయ రహదారి నిర్మాణంలో ఉంది. అలాగే కడప, తిరుపతి, విజయవాడ, హైదరాబాద్ రహదారుల్లో నిత్యం ఎదో చోట ప్రమాదం జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. క్షతగాతులను ఆస్పత్రిలో చేర్పించడానికి దివంగత సీఎం వైయస్.రాజశేఖర్ రెడ్డి ఏర్పాటు చేసిన 108 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాద స్థలానికి సకాలంలో చేరుకోక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఇతర వాహనాల్లో ఆస్పత్రికి తర లించే అవకాశం ఉన్నప్పటికీ స్థానికులకు అవగాహన లేక కళ్లముందే కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నా బంధువులు, స్నేహితులు నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు.

ఆస్పత్రిలో చేర్పిస్తే.. నగదు పురస్కారాలు

గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు నిలిపే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల కిందట గుడ్ సమర్టిన్ చట్టాన్ని ప్రారంభించింది. క్షతగాత్రులను తరలించడానికి భయపడే వారికి కేంద్ర ప్రభుత్వం నగదు పురస్కారాన్ని ప్రకటించింది. తద్వారా అపోహలు పోతాయని భావిస్తోంది. ఈ చట్టం ప్రకారం జాతీయ, రాష్ట్రీయ రహదారులపై ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తే వారికి రూ.5వేలు అందుతుంది. ఇది పొందాలంటే బాధితుడిని గంటలోపు ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారు ప్రాణదాత అంటూ ప్రమాద వివరాలతో కూడిన లేఖ ఇస్తారు. దానిని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి సొమ్ము ప్రాణదాత ఖాతాలో జమవుతుంది. ప్రశంసా పత్రం కూడా పొందవచ్చు. ఒక వ్యక్తి ఏడాదిలో ఐదు సార్లు అవార్డు పొందే అవకాశం ఉంది. కాపాడిన వారి వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పాల్సిన పనిలేదు. డబ్బు ఖర్చు చేయాల్సిన పనిలేదు.ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోవచ్చు. ఇతరుల నుంచి బెదిరింపులు రాకుండా ఒక కమిటీ రక్షణ కూడా కల్పిస్తుంది. ఏడాదిలో ఎక్కువ మందిని కాపాడిన పదిమందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున నగదు బహుమతి అందజేస్తారు.

అపోహలు వీడి ఆదుకోండి



రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు స్థానికులు స్పందించి గంటలోపు ఆస్పత్రికి చేర్పిస్తే వారికి గుడ్ సమర్టిన్ పథకం కింద నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం అందజేస్తారు. ప్రజలు అపోహలు వీడి గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి. తద్వారా విలువైన ప్రాణాలను కాపాడిన వారవుతారు. పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులుండవు. దీనిపై గ్రామీణ ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

– నాగభూషణం, సర్కిల్ ఇన్స్‌పెక్టర్, బద్వేల్ రూరల్

కార్యాలయానికి వచ్చే వారిని గౌరవించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధ

పోరుమామిళ్ల : కార్యాలయానికి వచ్చే వారిని గౌరవించాలని, వారి సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. మండల ఉపాధ్యక్షుడు సీఎం.బాషా అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సర్వసభ్య సమావేశంలో సభ్యులు ప్రస్తావించే అంశాలను నోట్ చేసుకొని, మళ్లీ సమావేశానికి వచ్చినపుడు ఎన్ని పరిష్కారమయ్యాయో సమీక్షించాలని పేర్కొన్నారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారంతా ఏ పార్టీ వారైనా ఎంపీడీఓ, ఎమ్మార్వోలు వారి సమస్యలు విని పరిష్కరించాలని తెలిపారు. వైస్ ఎంపీపీ సీఎం .బాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ సచివాలయాల్లో కొందరు సిబ్బంది ఉండడంలేదని, వీఆర్వోలు బయట చెట్ల కింద ఎక్కువ సేపు ఉండిపోతున్నారని, రైతులు, విద్యార్థులకు పలకడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వెస్ ఎంపీపీ-2 రాజశేఖర్ మాట్లాడుతూ వడ్డెపాలెం సమస్య నాలుగేళ్లుగా చెబుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. మూడు నెలలకోసారి జరిగే మండల సమావేశాల్లో తప్పితే వ్యవసాయాధికారి ఎప్పుడూ కనిపించరన్నారు. మిగతా రోజుల్లో రైతులకు అందుబాటులో ఉండటం లేదన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల పనితీరు గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రమణారెడ్డి, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, అల్లా, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఖచ్చితమైన వివరాలివ్వాలి

పోరుమామిళ్ల : ఆస్పత్రికి మంజూరు చేసిన నిధుల వినియోగంపై ఖచ్చితమైన వివరాలు చూపాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. పోరుమామిళ్లలోని 50 పడకల ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘ సమావేశం మంగళవారం జరిగింది. ముందుగా ఆస్పత్రికి సంబంధించి రూ. 2.5 లక్షల నిధులున్నాయని, ఎలా వినియోగిస్తారనేది ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఖచ్చితంగా వివరాలు చూపితే తాను సంతకం చేస్తానన్నారు. డాక్టర్ మృదుల, గిరి ప్రణీత్, ముత్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే సంబంధిత స్కానింగ్ సెంటర్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌లో మంగళవారం సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టం పూర్తి స్థాయిలో అమలుచేయాలన్నారు. ఆడ బిడ్డను రక్షించాలంటే గర్భస్రావాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎవరైనా స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు లింగ నిర్ధారణ చేసినట్లు తెలిస్తే కమిటి దృష్టికి తీసుకురావాలన్నారు. డాక్టర్ ఆనంద్‌బాబు, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ఇలియారాణి, మౌనిక, హిమబిందు, భరత్, అలీం, పద్మిని, మోహన్, వెంకటేశ్వర్లు, శోభారాణి, శ్రీదేవి, దేవదాసు పాల్గొన్నారు.

అప్పరాజుపేటలో.. పొలం పిలుస్తోంది

అట్లూరు : బద్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని అప్పరాజుపేటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బద్వేల్ ఏడీఏ ఎం.నాగరాజ, సిబ్బంది కలిసి రైతు వెంకటసుబ్బయ్య పొలంలో వరి పంటకు పేడ, మూత్రం, బెల్లం, పప్పుదినుసుల పిండి, పుట్టమన్ను ఉపయోగించి 200 లీటర్ల జీవామృతం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వరిలో రసం పీల్చు పురుగుల నివారణకు జిగురు పూసిన పసుపు పల్లాలు అమర్చారు. అనంతరం రాజుపాలెం గ్రామ రైతుసేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఈ–పంట పురోగతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్.వి.మహతి, వెంకటేశ్వర్‌రెడ్డి, మమత, మౌలాబీ, వెంకటేశ్వర్లు, శ్రీరామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్ష



మాట్లాడుతున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు క్రైం : హెల్మెట్ ధారణ ప్రాణాలకు రక్షణగా నిలుస్తుందని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీ, హెల్మెట్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఆయన మంగళవారం డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువగా యువకులే రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఒక వ్యక్తి చనిపోతే ఆ కుటుంబసభ్యులు పడే బాధను వర్ణించలేమని చెప్పారు. కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకొని బైక్‌లో ప్రయాణించేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని, హెల్మెట్ ఆవశ్యకతను పదిమందికి తెలియజేయాలని సూచించారు. అనంతరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి రాజీవ్ సర్కిల్, శివాలయం సెంటర్, మీదుగా మైదుకూరు రోడ్డులోని పాండురంగస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మురళీధర్, సీఐలు యుగంధర్, రామకృష్ణారెడ్డి, దేవకిరణ్, గోవిందరెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, ఎంవీఐలు నారాయణనాయక్, రవీంద్రనాయక్, హేమకుమార్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న లాయర్ జేకే.చారి

దువ్వూరు(చాపాడు) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా న్యాయ చట్టాలను వినియోగించాలని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రీసోర్స్ పర్సన్లు జేకే. చారి, శివరామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గృహహింస, వరకట్న వేధింపులు, అపహరణ, యాసిడ్ దాడి, అత్యాచారం, గ్యాంగ్ రేప్, మహిళలకు సమాన పనికి సమాన వేతనం, ఫ్యాక్టరీల చట్టం, అనైతిక ట్రాఫిక్ చట్టం–1956, మహిళల ఫిర్యాదు పరిష్కరించాలన్నారు. ఎన్సీ డబ్ల్యూ పాత్ర, విధులు, మహిళల మనోవేదలను పరిష్కరించడంలో నల్సా యొక్క పాత్ర, విధులు, మానవ అక్రమ రవాణా, వన్ స్టాప్ సెంటర్, లక్ష్యాలు, దరఖాస్తులు, కౌన్సిలింగ్ వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయచంద్రారెడ్డి, ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను ప్రమాదంలోకి నెట్టవద్దు

కలసపాడు: సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యను ప్రమాదపుటంచుల్లోకి నెట్టవద్దని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి ఓ ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీనం ప్రక్రియకు సంబంధించిన జీవో 117 రద్దు చేసి మెరుగైన వ్యవస్థను అందుబాటులోకి తెస్తామనడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. మూడు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలనుంచి 3, 4, 5వ తరగతులను కొత్తగా ఏర్పాటు చేయబోతున్న ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు తరలించడం వలన ఆయా గ్రామాల విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ ఇచ్చినా ఎలాంటి ఉపయోగం లేదన్నారు. 75 మందికి పైబడిన ఉన్నత పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులిచ్చి 120 మంది ఉంటే ప్రాథమిక పాఠశాలకు హెచ్‌ఎం పోస్టు ఇస్తామనడం సరికాదన్నారు. రద్దు సవరణలపై పునరాలోచించి పాఠశాలలను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఖాజీపేట: మండలంలోని సన్నపల్లెలో సోమవారం తెల్లవారుజామున వైఎస్సార్‌సీపీ నాయకుడు తుమ్మలూరు రవీంద్రారెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ 12 లక్షల విలువగల ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి రవీంద్రారెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. చోరీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.. సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగ్గురు మట్కా బీటర్లు అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మట్కా నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు వివరాల మేరకు రామేశ్వరంలోని మోరీల వద్ద మట్కా నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో మంగళవారం సాయంత్రం వన్ టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో బొలిశెట్టి వెంకటసుబ్బయ్య, కలిమిశెట్టి ప్రసాద్, ఇస్మాయిల్‌లను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.33,010 నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులుగా వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా నేతాజీ సుందర్ సుకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం సభాభవనంలో ఎంపీడీఓ రమణారెడ్డి ఆధ్వర్యంలో కార్యదర్శుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రవిశంకర్‌రెడ్డి, ఓబులేసు, గౌరవ సలహాదారుగా రాజీవ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నారాయణబాబు, రవికిశోర్, మహిళా అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, కార్యదర్శులుగా అశోక్‌కుమార్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్లను ఎన్నుకున్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి

బద్వేలు అర్బన్ : పట్టణంలోని హోటళ్లలో ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి నిర్వాహకులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని పలు హోటళ్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ప్లాస్టిక్ కవర్ల స్థానంలో అరిటాకులు, విస్తరాకులు వాడుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లలో ప్లేట్లు, ఆహార పదార్థాలు పార్సిల్ చేసేందుకు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారన్నారు.

సకాలంలో పన్ను చెల్లించాలి

సకాలంలో పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నీటిసరఫరా సిబ్బంది, పన్ను వసూళ్ల సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటి, నీటి పన్నులు పెండింగ్‌లో ఉన్న వంద మందిని గుర్తించి ఇప్పటికే నోటీసులు అందజేశామని, పన్ను చెల్లించేలా సిబ్బంది కృషి చేయాలన్నారు.

తిరస్కరించడం అన్యాయం

ప్రొద్దుటూరు : ఫిజికల్ ఈవెంట్స్‌కు వయసు లేదని పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులను తిరస్కరించడం అన్యాయమని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ తెలిపారు. డీవైఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022 నవంబర్, 28న 6100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 2023 జనవరి, 22న ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా 95,208 మంది అర్హత సాధించారన్నారు. ఈ లోగా ఎమ్మెల్సీ ఎన్నికలు, కోర్టు కేసుల ఫలితంగా ఫిజికల్స్ ఈవెంట్స్ వాయిదా పడుతూ వచ్చాయన్నారు. ఇప్పుడు అభ్యర్థులకు వయసు లేదని తిరస్కరించడం అన్యాయమన్నారు.